# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 19 జూన్ 2023


## ప్రభుత్వ పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



**రాయచోటి, జూన్ 18(ప్రభాతవార్త):**

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తానని రాయచోటి నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సిపి కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని పెన్షనర్ల సంఘం నాయకులు కలిశారు. వివిధ సమస్యలుపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షమానికి జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలును ఎమ్మెల్యే వివరించారు. పట్టణ అభివృద్ధి కోసం మీరు చేస్తున్న కృషి అభినందనీయమంటూ శ్రీకాంత్‌రెడ్డిని పెన్షనర్ల సంఘ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు రమణ, అసోసియేట్ అధ్యక్షుడు పి. చెన్నరెడ్డెన్న, కార్యదర్శి ఈశ్వరయ్య, వారాది రెడ్డి, గురవయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 19న కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం

### కలెక్టర్ గిరీష పిఎస్

**రాయచోటి జూన్ 18, ప్రభాతవార్త**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 19న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి "జగనన్నకు చెబుదాం - స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. అలాగే స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అనారోగ్య పరిస్థితులపై ముందస్తు జాగ్రత్తలేవి..?

- హెల్త్ క్లినిక్‌ల పనితీరు సమీక్షించాలి
- **288కి 107** హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు పూర్తి
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రబలుతున్న వ్యాధులు
- పారిశుధ్య లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక నిధులు అవసరం
- అన్ని ట్యాంకులు క్లోరినైజేషన్ చేయాలి
- మొదలైన తొలకరి జల్లులు



**అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త**

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని అనారోగ్య పరిస్థితులపై ముందుస్తు జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి పెట్టాల్సిన ఆవసరం కనిపిస్తోంది. హెల్త్ క్లినిక్‌ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు వీలవుతుంది. ప్రజల ముంగిటకు పరిపాలనను తీసుకురావాలన్న సత్ సంకల్పంతో 2019 జూలై 19న రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. అన్నమయ్య జిల్లాలో మొత్తం 501 గ్రామ పంచాయితీలున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా విద్య వైద్య పరంగానే కాకుండా అన్ని రకాలుగా ప్రజలకు ప్రభుత్వ సేవలను ముంగిటకు తీసుకొచ్చే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాల శీతలీకరణ కేంద్రాలు, డిజిటల్ గ్రంధాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం అనుకున్న రీతిలో జిల్లాలో పూర్తి కానందున ఆరోగ్య పరంగా తగు చర్యలు తీసుకోలేకపోతున్నట్లు ఆరోపణలు న్నాయి. అన్నమయ్య జిల్లాలో సచివాలయ భవనాలతో పాటు హెల్త్ క్లినిక్‌లకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు 413 గ్రామ సచివాలయాలకు భవనాలు మంజూరు చేసినా అందులో ఇప్పటికి 244 భవనాలు మాత్రమే పూర్తవ్వగా 144 భవనాలు వివిధ దశల్లో ఉండగా 25 భవనాల నిర్మాణం మొదలవ్వలేదని తెలిసింది. అదే విధంగా హెల్త్ క్లినిక్‌లు 288 మంజూరు కాగా అందులో 107 భవనాలు పూర్తవ్వగా, 123 భవనాలు వివిధ దశల్లో ఉండగా 58 భవనాలు మొదలవ్వ లేదని సమాచారం. హెల్త్ క్లినిక్‌లను గ్రామ సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా బలోపేతం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఆనారోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది. లేకుంటే గ్రామ సచివా లయ వ్యవస్థ, హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వం ఆశించిన ఫలితాలు దక్కవని గుర్తించాల్సి ఉంది. కనుక త్వరితగతిన హెల్త్ క్లినిక్‌లు ప్రతి గ్రామ సచివాలయానికి అనుబంధంగా ఉండేలా చర్యలు తీసుకొని ఎప్పటికప్పుడు వారి పరిధిలోని గ్రామాల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులను సమీక్షించుకుంటూ ఆవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. ఇకపోతే గ్రామ పంచాయితీలకు నిధుల కొరత వెంటాడుతుండడంతో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారవుతోంది. కనుక జిలా్ల అధికారులు గుర్తించి ప్రతి గ్రామపంచాయితీకి పారిశుధ్యం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అన్ని నీటి ట్యాంకులను క్లోరినైజేషన్ చేయాల్సి ఉంది. తద్వారా గ్రామాల్లో ఆనారోగ్య పరిస్థితులు ప్రబల కుండా నివారించేందుకు వీలవుతోంది. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతి నిధులు సత్వరం స్పందించి గ్రామ పంచాయితీలకు ప్రత్యేక నిధులు మంజూరుపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ నిధులు అంటువ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్యం కోసమే ఖర్చు పెట్టేలా నిబంధనలు పెట్టడం అవసరం. గ్రామ పంచాయితీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక నిధులు మంజూరు కాకుంటే అంటువ్యాధులు కూడా ప్రబలే పరిస్థితులున్నాయి. హెల్త్ క్లినిక్ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతపై అన్ని వర్గాల ప్రజలు దృష్టి పెట్టేలా కార్యాచరణ చేపట్టడం ద్వారా కొంతవరకు ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం తీసుకురాగలుగు తారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో ఆదివారం తొలకరి జల్లులు మొదలయ్యాయి. కనుక వర్షపునీటి కుంటను కూడా తొలగించాల్సి ఉంది. లేకుం టే దోమలు ప్రబలే పరిస్థితులున్నాయి. తాజాగా వాతావరణంలో చోటు చేసుకుం టున్న మార్పులతో ఇప్పటికే విరేచనాలు, జ్వరాలతో ప్రైవేట్ క్లినిక్‌లకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎక్కువగా వాంతులు, విరేచనాల బారిన పడుతున్నట్లు తెలుసో ంది. ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలతో పాటు, హెల్త్ క్లినిక్‌లలో అన్నిరకాల అంటురోగాలకు అవసరమైన మందులు చాలావరకు సిద్ధంగా ఉన్నప్పటికి గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలందరికి ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. కనుక వాతావరణంలో రోజురోజుకు జరుగుతున్న మార్పులకు అనుగుణం గా ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపాలిటీలు, పంచాయితీ అధికారులు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతా తక్కువగా ఉండడం కూడా ఆరోగ్య సమస్యలు ఏర్పడేందుకు ప్రధాన కారణమవుతున్నందున తరచూ గ్రామీణ ప్రజలను ఆరోగ్యరీత్యా చైతన్యపరిచే చర్యలు అవసరం.

### రాయచోటిలో

# రియల్ ఎస్టేట్ ధమాల్...

### బ్రోకర్ల మాయాజాలం... రూ. కోట్లు పెట్టి కొన్నవాళ్లు లబోదిబో





**రాయచోటి జూన్ 18, ప్రభాతవార్త**

రాయచోటి పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా కుప్ప కూలింది. అన్నమయ్య జిల్లా ప్రకటన వెలువడిన వెంటనే రాత్రికి రాత్రే బ్రోకర్ల మాటలతో కొనుగోలుదారులు కోటీశ్వరులం అయిపోవచ్చని కలలు కని లక్షలు విలువ చేసే భూములకు కోట్ల రూపాయలు పెట్టి కొన్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటి ప్రకటించడంతో కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయం ఇంకా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయి పరిపాలన కూడా సంవత్సరం పూర్తయింది. అయితే జిల్లా రిబ్బన్ కటింగ్ చేసిన వెంటనే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగిపోయింది భూములకు మాత్రం భారీగా లాభాలు వస్తాయని భావించిన కొనుగోలుదారులకు మాత్రం భారీగా నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది బ్రోకర్ల మాయాజాలానికి బలైన అభాగ్యులు తాము కొన్న భూములను ఇప్పుడే కొనే నాధుడే లేక మిగిలిన డబ్బు కట్టడానికి చేతుల్లో డబ్బు లేక లాభాల మాట దేవుడు ఎరుగు పెట్టిన పెట్టుబడి చేతికొస్తే చాలని కొనుగోలుదారులు ఎదురుచూస్తున్నారు జిల్లా ఆవిర్భావంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భారీగా పెట్టుబడులు పెట్టారు రాయచోటి తిరుపతి మదనపల్లె పీలేరు కదిరి అనంతపురం పులివెందుల జమ్మలమడుగు ప్రొద్దుటూరు కడప రాజంపేట ప్రాంతాలనుంచి కూడా రాయచోటిలో రియల్ ఎస్టేట్ కు పెట్టుబడులు పెట్టారు సుమారు 17 మండలాలకు రాయచోటి అనువైన ప్రాంతం వ్యాపారాలు కూలి పనులు చదువు కోసం ఇలా బయట ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతుంటారు ఈ నేపథ్యం లో రాయచోటిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతూ ఉంటుంది దీనిని కొందరు బ్రోకర్లు సొమ్ము చేసుకుంటూ ఉంటారు భూములకు ధరలు రాయచోటిలో ఉన్నంతగా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ ఉండదంటే అతిశక్తి కాదేమో.

**కోట్లు పెట్టి కొన్నవాళ్లు లబోదిబో**

జిల్లా ఆవిర్భావం పరిపాలన మొదలయ్యే సంవత్సరం రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది ప్రస్తుతం స్థలాలను అడిగే నాథుడు కరవయ్యారు జిల్లా కంటే ముందు ఎకరాపు భూమి లక్షల్లో ఉన్నచోట్ల కోట్లకు చేరుకుంది. బెంగళూరు చెన్నై హైదరాబాద్ తిరుపతి నుంచి, ఎక్కడెక్కడ నుంచో బయట వ్యక్తులు వచ్చారు భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఆ రోజుల్లో అనేక చేతులు మారిపోయాయి లక్షల రూపాయలతో మొదలై కోట్లకు చేరి నిలిచిపోయాయి. రాయచోటి నుంచి ఇటు గువ్వలచెరువు, అటు వేంపల్లి, ఇటు మదనపల్లె, అటు పీలేరు, వరకు ఎకరా కోటి రూపాయలు పైన ధర పలికింది చివరికి డీకేటి పట్టా కూడా ఎకరా కోటి రూపాయలు పైన ధర పలికింది. రాయచోటి పట్టణం చుట్టు పక్కల ఎకరా ఐదు ఆరు కోట్ల వరకు ధర పలికింది జిల్లా ఏర్పడిన అనంతరం ఎక్కడా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతున్న ఆనవాళ్లు కనబడడం లేదు మేము భూములు అమ్ముతాం అంటున్న ఎవరు కొనే వాళ్ళు లేరు ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్ప కూలిపోయింది. చాలామంది వ్యాపారులు తమ దగ్గర ఉన్న డబ్బులు కంటే అధికంగానే అప్పులు చేసి ఆస్తులు కొన్నారు. ప్రస్తుతం ఆస్తులు విలువ రోజుకు రోజుకు వ్యాపారాలు లేక అవసరాల కోసం కొందరు కొన్న రేట్లు తగ్గించి అమ్ముతున్నారు చాలామంది కేవలం టోకెన్ల మీద వ్యాపారాలు చేశారు. ఎంతో కొంత లాభం పెట్టుకొని అమ్మేస్తారు ఇలా చేతులు మారిన ఆస్తులు డబ్బులు చెల్లించలేక వివాదములు పడుతున్నాయి. మొదట కొన్న వాళ్ల నుంచి చేతులు మారి చివరగా కొన్న వాళ్ళ దగ్గర వివాదం అవుతున్నాయి. అగ్రి మెంట్లు టైం అయిపోయిన మూడు భాగాలు డబ్బు చెల్లించ లేక మధ్యవర్తుల వద్ద పంచాయతీలు జరుగుతున్నాయి. కొన్ని పంచాయతీలు పోలీస్ స్టేషన్ వరకు కూడా వెళున్నాయి అడ్డు అదుపు లేకుండా సాగిన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని జిల్లాలో అడ్డుకునేవ్యవస్థ లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**రిజిస్ట్రేషన్ రేట్లు పెంచడం రియల్‌ఎస్టేట్‌పై ప్రభావం**

రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతూ పోవడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారుల పైన మూలిగే నక్క పై తాటికాయ పడ్డట్లు అయింది. అలాగే రాయచోటి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ కావడం తో వెంచర్లు వేసిన యజమానులు మున్సిపాలిటీ అప్రూవల్ లేకుండా చాలా వరకు వేశారు, వాటిని రిజిస్ట్రేషన్ చేయకూడదని జిల్లా ఏర్పడిన తర్వాత దాదాపు నాలుగు నెలలు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు దీంతో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిలిచిపోయింది వెంచర్ల నందు ఇరవై శాతం భూమి మున్సిపాలిటీకి కేటాయించకపోవడం జరిగింది. వీటన్నిటిని సవరించుకోవడానికి చాలా ఆలస్యమైంది అప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగిపోవడం బయట ప్రాంతాల నుంచి వచ్చినా వ్యాపారులు వెళ్లిపోవడం జరిగింది. ప్రస్తుతం అమ్మేందుకు చాలామంది ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు అయితే కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ఒకప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయం రిజిస్ట్రేషన్ లతో కలకలలాడేది ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయం వెలవెల పోతుంది. ఈ సంవత్సరం జూలై నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుందని చాలామంది వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.

# టిడిపి వైపు మైనార్టీల చూపు

### వైసిసి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు పూర్తి అవుతున్నా చాకిబండ గ్రామంలో అభివృద్ధి శూన్యం

### రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ...కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి





**చిన్నమండెం జూన్ 18, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలందరూ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నారని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తారని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి రాష్ట్ర భవిష్యత్తు కు చంద్రబాబు గ్యారెంటీ , మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం మైనార్టీలను ఉద్దేశించిన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది ముస్లిం మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేసిందన్నారు.టిడిపి అధికారంలో ఉన్నప్పుడు 2015-16 లో రూ.540 కోట్లు,2016 -17 లో రూ.710 కోట్లు,2017- 18 లో రూ.840 కోట్లు,2018-19 లో రూ.1140 కోట్ల నిధులు కేటాయించిందన్నారు.దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లిం యువతిల వివాహాలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చెల్లించిందన్నారు.విదేశీ విద్యోన్నతి పథకం ద్వారా ముస్లిం విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇమామ్ లకు గౌరవేతనం,రంజాన్ నెలలో ముస్లింలకు మైనార్టీలకు రంజాన్ తోఫా,చంద్రన్న పెళ్లి కానుక తో పాటు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన పేదలకు స్వయం ఉపాధి పొందుటకు తక్కువ వడ్డీ శాతంతో రుణాలు అందజేశామన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని గాలికి వదిలి వారిని ఓటు బ్యాంకు చూసుకున్నారే తప్ప వారి అభివృద్ధికి,సంక్షేమానికి కృషి చేయలేదన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ముస్లింలు అధికంగా ఉన్నారని వారి ఆర్థిక స్థితిగతులు పరిశీలించడానికి తాను ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వారికి ప్రభుత్వం ఎలాంటి సదుపాయాలు కల్పించాలి,ఇప్పటి వరకు ప్రభుత్వం ఏమి సహాయం చేసింది అనే విషయాలు కూలంకషంగా తెలుసుకుంటున్నట్లు రమేష్ కుమార్ రెడ్డి చెప్పారు. రాయచోటి పట్టణంలో సుమారు రెండు నెలలు తాను ఇంటింటికి వెళ్లి రాష్ట్ర భవిష్యత్తు కు చంద్ర బాబు గ్యారెంటీ , మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్య క్రమాలు నిర్వహించి ప్రజల్లో మమేకమవుతున్నామన్నారు. చాకిబండ పంచాలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి శూన్యం వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పంచాయితీలో ఒక్క మీటర్ రోడ్ కూడా వెయ్యలేదని ,డ్రైనేజీ లు కూడ లేవని, చంద్ర బాబు ప్రవేశపెట్టిన మొదట విడత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎంతో ఆలోచనతో ముందు చూపుతో ప్రకటించడం సంతోషకరమని ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని వైసిపి ప్రభుత్వం పట్ల తీవ్ర విముఖత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీ తో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లం నరసింహారెడ్డి, చాకిబండ గ్రామ అధ్యక్షులు అమానుల్లా, అల్లా బకాశ్, జయశంకర్, ఖాదర్ భాష, ఆర్షద్,చిన్నపరెడ్డి, మన్నేరు, రమణ, ముబారక్, జగ్గయ్య, ఖదీర్, న్యమత్, రమణారెడ్డి, అమర్నాద్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్‌లు హరి అమర్నాద్ రెడ్డి, దేవగోపాల్ నాయుడు, చెన్నకృష్ణారెడ్డి, బాసిత్ ఖాన్, నాగ భూషణం, శివయ్య, వెంకటరమణ, రాజ,హనుమంతు నాయుడు,నాగేశ్వర రావు, రెడ్డెప్ప, వెంకటాద్రి, వెంకటాద్రి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

### రూ. 20లక్షలు నష్టం



**రామసముద్రం, జూన్ 18 ప్రభాతవార్త :**

రామసముద్రం మండల కేంద్రంలో ఓ ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.20లక్షలు ఆస్థినష్టం సంభవించినట్లు పోలీసలు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. రామసముద్రంలో పట్టణంలోని శ్రీనివాసులు కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. ఇతని ఇంటిలో ఆదివారం ఉదయం షార్టు సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానిస్టేబుల్ ఇంటిలో లేని సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినపుడు మంటలు ఇంటిలోనుంచి రావడంతో స్థానికంగా ఉన్న మంజునాథ్ గమనించి కేకలు వేశాడు. దీంతో స్థానికులు వచ్చి విద్యుత్ సరఫరా ఆపివేసి, ఇంటిలోని వస్తువులు బయటవేశారు. అప్పటికే కొన్ని వస్తువులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక కార్యాలయానికి పోన్ చేయగా అధికారులు వచ్చి మంటలను ఆర్పారు. కాలిపోయిన వస్తువులు సుమారు రూ.20లక్షల వరకు ఉంటాయిన అంచనావేశారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, ఎస్ఐ చంద్రశేఖర్, సురేష్, పోలీస్ సిబ్బంది, దొడ్డిపల్లి ఆనంద్, మంజునాథ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# పూర్తి కాని సచివాలయ మరుగుదొడ్లు



**దువ్వూరు, జూన్ 18, ప్రభాతవార్త**

మండల పరిధిలోని గ్రామ సచివాలయాల వద్ద ప్రభుత్వం గ్రామ సచివా లయాలకు వచ్చే ప్రజల కోసం మరుగుదొడ్లు నిర్మిం చాలని ప్రభుత్వం ఆదేశిం చింది. ఆ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా దువ్వూరులోని రెండు గ్రామ సచివాలయాల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కేవలం పునాదులకే పరిమితం అయ్యాయి. ప్రజలు గ్రామ సచివా లయానికి వస్తే అప్పుడు వారి అవసరాలకు మరుగుదొడ్లు వినియోగించే సౌకర్యం ఉండాలని వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా చింతకుంట, గుడిపాడు, కానగూడూరు, జిల్లెళ్ల, ఎడమడక గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మానం పూర్తయి వాటిని వినియోగించుకుంటున్నారు. దువ్వూరులోని 2 గ్రామ సచివా లయాల వద్ద కేవలం పునాదులు వేశారే తప్ప పూర్తి చేయలేదు. సచివాల యాలకు వచ్చే ప్రజలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వాటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


**పాఠ్యపుస్తకాల పేరుతో కార్పొరేట్ దోపిడీ** II లో



**వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డి కార్యాలయం ఎదుట ధర్నా** IIలో

## వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ఏపీఎన్జీవోల ధర్నా



కడప కార్పొరేషన్, జూన్ 18, ప్రభాతవార్త:

కడప రీజనల్ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఏపీ ఎన్‌జీవో నాయకులు ధర్నా చేశారు. నేటి నుంచి నాలుగు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు జరగాల్సి న సాధారణ బదిలీలు 20వ తేదీ నుంచి 22 వరకు పోస్టుపోన్ చేయ డంపై ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్ నాయకులతో కలిసి ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కడప రీజియన్‌లో మాత్రంపై అధికారులు ఆదేశాలు లేకున్నా పోస్టుపోన్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాలుగు జిల్లాల ఉద్యోగులు ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. కార్యాలయంలో ఆర్‌డీ డాక్టర్ అనిల్‌కుమార్ ఆఫీస్‌లో లేకపోవ డంతో డీడీతో మాట్లాడడం జరిగిందన్నారు. కొంత మంది కారణంగా పోస్టుపోన్ చేశామని చెప్పడం దారుణమన్నారు. ఈ విషయాలను ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేయాలని కోరామన్నారు. బదిలీల్లో గోల్‌మాల్ జరుగుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయ కులు బాలపుల్లయ్య, రాజశేఖర్, జయలక్ష్మి, నరసింహారెడ్డి, సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి సైలేశ్వర్‌రెడ్డి, రాయచోటి అధ్యక్షులు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి డి.వెంకటే శ్వరరెడ్డి, ప్రొద్దుటూరు అధ్యక్షులు రఘురామారెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, కమలాపురం అధ్యక్షులు నాగలక్ష్మిరెడ్డి, రత్నం,రాజు, మహబాషా, పద్మనాభం, వెంగలరావు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వారిచే ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్



ప్రొద్దుటూరు రూరల్ జూన్ 18, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ వారిచే ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ నందు ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్ ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎం అక్షిత్ కుమార్ పాల్గొని దాదాపు 180 మందికి పరీక్షలు నిర్వహించి, వారికి సలహాలు ఇస్తూ ఉచిత మందుల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎముకలు, కీళ్ల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జి రామకృష్ణ, సెక్రటరీ టి.బాల సూర్యరావు, రోటరీ ట్రస్ట్ హాస్పిటల్ ప్రెసిడెంట్ కే. శివకుమార్, సత్తుపల్లి రాంప్రసాద్ రెడ్డి, బాబాసాహెబ్ సూర్యనారాయణరెడ్డి, మెహబూబ్ భాష, ఖాదర్ భాష రోటరీ సభ్యులందరూ పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

– బేడా బుడగ జంగం నేత పస్తం అంజి



కడప కార్పొరేషన్, జూన్ 18, ప్రభాతవార్త:

తమ బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని బేడా బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి స్తం అంజి కోరారు. ఆదివారం నగరంలోని బేడా బుడగ జంగం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొన్ని కులాలను ఓబీసీలో రాష్ట్ర ప్రభుత్వం క్యాబినేట్‌లో వాల్మీకి బోయ కులాలను ఎస్టీలుగా చేర్చారు. కానీ మమ్మల్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎస్సీలుగా గుర్తించకపోవడం వల్ల విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా తమ పిల్లలు పొందలేకపోతున్నామని వాపోయారు. ఇతర రాష్ట్రాల్లో తమ కులాన్ని ఎస్సీలుగా పరిగణిస్తున్నారని చెప్పారు. కావునా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా తమను దృష్టిలో ఉంచుకొని క్యాబినెట్‌లో మా బేడా బుడగ జంగం కులానికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో బేడా బుడగ జంగం నాయకులు డి.రాముడు, లక్ష్మయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

## అఖండ విశ్వరుషి గురు కూటమిలో సూర్య చికిత్స గాయత్రి హహా యజ్ఞం



కమలాపురం, జూన్ 18, ప్రభాతవార్త:

కమలాపురం అఖండ విశ్వ రుషి గురు కూటమి నందు ఆదివారం అమావాస్య రోజు సందర్భంగా ప్రపంచమంతా సకల ప్రాణులు, ఎండ తీవ్రత తట్టుకొనేం దుకు సూర్య చికిత్స గాయత్రి మహా యజ్ఞం నిర్వహిండం జరిగింది. సుమారు 15 మంది భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. యజ్ఞం అనంతరం భోజన ప్రసాద వితరణ జరిగింది. ఈ యజ్ఞఫలితంగా కడప జిల్లాలోనే కాకుండా యావత్ ప్రపంచంలో కూడా సకల ప్రాణులకు ఎంత అవసరమో అంత వేడి తగ్గి వర్షాలు మొదలవుతాయి. యజ్ఞానానికి వచ్చిన వారికి సహకరించిన వారికి యజ్ఞ ఫలి తంతో వారి కుటుంబం ఆయురారోగ్యంతో విద్యా ఉద్యోగం, ధన అభివృద్ధి, కుటుంబ అభివృద్ధి, ఫలితాలు ఉంటాయని ప్రధాన అర్చకులు నిత్యానందం, విజయ భాస్కర్ ఆచార్యులు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కమలాపురం, జూన్ 18, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని బస్టాండ్ వీధిలో ఉన్న జహీర్ అనే యువకుడు ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కమలాపురం పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## పాఠ్యపుస్తకాల పేరుతో కార్పొరేట్ దోపిడీ

– పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న



కడప ఎడ్యుకేషన్, జూన్ 18, ప్రభాతవార్త:

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజ మాన్యాలు పాఠ్యపుస్తకాల పేరుతో తల్లిదండ్రుల వద్ద దోపిడీకి పాల్పడుతున్నారని విద్యాశాఖాధికారులకు యాజమాన్యాలకు అమ్ముడుపోయారని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న ఆరోపించారు. కడప నగరం, ప్రొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, పులివెందుల ప్రాంతాల్లో పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా పాఠ్య పుస్తకాలు పేరుతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల వద్ద నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలుగా అనేక ఫిర్యాదులు చేసినా విచారణ, చర్యలు చేపట్టలేదన్నారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్తులకు జగనన్న విద్యాకానుక పేరుతో ప్రభుత్వం టెండర్ ద్వారా ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్త కాలు, వర్క్ బుక్కులు, మూడు జతల బూట్లు సాక్షులతో సహా బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు డిక్షనరీ ఇలా అన్నిటికీ కలిపి కేవలం మొత్తం 2400 రూపాయలు ఖర్చు చేస్తోందని, ఇదే కార్పొరేట్ ప్రైవేటు పాఠవాలలో వారు ఇచ్చే 7,8 పుస్తకాలకే రూ.6వేల నుంచి రూ.10వేలు తీసుకుంటున్నారు. వారి ఆదాయం మొత్తం సగభాగం పుస్తకాలల్లోనే సంపాదిస్తున్నారు. సీఎం జిల్లాలోనే ఫీజులు డొనేషన్ల రూపంలో మరియు పాఠ్యపుస్తకాలతో సహా దోపిడీకి గురి చేస్తు న్నారని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి, వైఎస్ఆర్ జిల్లా డీఈవో రాఘవ రెడ్డి, అన్నమయ్య జిల్లా డీఈవో పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ డీఈవో రాజగోపాల్ రెడ్డి, కృష్ణప్ప, వరలక్ష్మి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు రెన్యువల్ విషయంలో మామూళ్లు తీసుకొని అనుమతులు ఇస్తున్నారని అందుకే ప్రతి ఏటా నియోజకవర్గ కేంద్రాలలో అనేక కార్పొరేట్ పాఠశాలలు ఏర్పాటవుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు శ్రీనివాసులురెడ్డి, అన్నమయ్య జిల్లా పీడీఎస్‌యూ నాయకులు అక్రం, మస్తాన్ పాల్గొన్నారు.

## వైసీపీని విమర్శించడమే పనిగా పెట్టుకున్న పవన్, చంద్రబాబు

– వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్




కడప కార్పొరేషన్, జూన్ 18, ప్రభాతవార్త:

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్ అన్నారు. ఆదివారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యా లయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ ప్రభుత్వంపై, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టారని చెప్పు కున్న పవన్‌కల్యాణ్, తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ఏమాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదలకు మంచి చేస్తుంటే పవన్ కల్యాణ్ ఓర్వలేకపోతున్నారని పెత్తందారులకు మేలు జరగలేదని ఆవేశంతో ఊగి పోతున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు ఏమాత్రం గౌరవం లేదని, నక్సలైట్ల తరహాలో ప్రజా కోర్టులు నిర్వహిస్తామని చెప్పడం దారుణ మన్నారు. ప్రజల మద్దతు కూడగట్టి ఆయన అసెంబ్లీలో అడుగు పెడితే ఎవరికి ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. కేవలం వైసీపీని విమర్శించడం ద్వారానే ఓట్లు పడతాయనుకుంటే ఆయన భ్రమే అన్నారు. టీడీపీ హయాంలో ఎన్ని దోపిడీలు, దర్జన్యాలు, దాడులు జరిగిన మౌనంగా ఉన్న పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు మాట్లాడే అర్హత లేదని తెలిపారు. కార్యక్రమంలో వీఎన్‌పల్లి, ఎంపీపీ రఘునాథరెడ్డి, పాయసంపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, ప్రసాద్‌రెడ్డి, ఊటుకూరు సర్పంచ్ వెంకట రామిరెడ్డి, నాయకులు నిత్య పాల్గొన్నారు.

## శిల్పారామంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



కడప కార్పొరేషన్, జూన్ 18, ప్రభాతవార్త:

శిల్పారామంలో పాఠశాల విద్యా ర్థుల నృత్యాలు వీక్షకులను కనువిం దు చేశాయి. విస్పా మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే సందర్భం గా ఆదివారం కడప శిల్పారామం లోని సాంస్కృతిక కళావేదికపైన డ్యాన్సులు, వీక్షక ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. నాన్నకు ప్రేమతో భరత వేదం వంటి నృత్యాలు అలరించాయి. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయండి

ఏఐటియుసి శివరాం



మైదుకూరు జూన్18, ప్రభాతవార్త

భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకై ఈనెల 20వ తేదీన విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయవలసినదిగా ఏఐటీయూసీ నియోజక వర్గ ఇంచార్జి ఏ.వి శివరాం కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2006వ సంవత్సరములో ప్రారంభమైన సంక్షేమ బోర్డులో అప్పటి పాలకులు రాష్ట్రంలో 22 లక్షల మంది కార్మికులను నమోదు చేసుకొని వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి 11రకాల సౌకర్యాలను లేబర్ ఆఫీసు ద్వారా అమలు చేసే వారని. అమలులో కొన్ని లోపాలు ఉన్న వాటిని అప్పటి పాల కుల దృష్టికి తీసుకుని పోతే పరిష్కరించే వారని అన్నారు. కానీ ఇప్పటి జగన్మో హన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహించడమే మన భవిష్యత్తు కోసం మన భద్రత కోసం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు 1996ను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వం లేబర్ కమిషనర్ ద్వారా 1214అను సర్క్యులర్ నెంబర్ ను జారీ చేసి 9/2020 నుండి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ఎటువంటి సౌకర్యాలు కల్పించ వద్దని ఆదేశాలు జారీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ రోజు నుండి ఇప్పటి వరకు ఏ ఒక్క క్లైమ్ కూడా కార్మికులకు ఇవ్వలేదని పైగా గుర్తింప కార్డులు కూడా ఆపేశా రన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరు ద్ధరించాలని. పెండింగ్‌లో ఉన్న క్లైములకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణరంగానికి కీలకమైన సిమెంటు, ఐరన్, ఇసుక, కలప, కంకర ధరలను నియంత్రించాలని కోరారు. కార్మికుల డిమాండ్ల సాధనకై జూన్ 20వ తేదీ విజయవాడ జరుగు మహాధర్నా జయప్రదం చేయవలసినదిగా కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ సభ్యులు పిరయ్య, షవలి, శ్రీనివాసులు, మునెయ్య పాల్గొన్నారు.

## రామగిరి బాబా 160వ ఆరాధన మహోత్సవంలో హరిప్రసాద్



కడప వైద్యవిభాగం, జూన్ 18, ప్రభాతవార్త:

కడప నగరం అక్కాయపల్లి, భవానీ నగర్‌లోని శ్రీశ్రీ భగవాన్ రామగిరి బాబా గారి 160వ ఆరాధన మహోత్సవాలలో భాగంగా 3వ రోజు ఆదివారం జరిగిన కార్యక్రమంలో కడప నగర టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బాబాగారి ఆశీస్సులు అందరికీ ఉండేలా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ భగవాన్ రామగిరి బాబా సేవా సమితి అధ్యక్షులు షిండే రాజా భాస్కర్ రావు, జానకి బాయి, రాధాబాయి, షిండే రాజాభాస్కర్, అమర్‌నాథ్‌రెడ్డి, గీతా, సంతోష్ కుమార్‌రావు, నిర్మలా బాయి, శారదా బాయి, మనోజ్‌కుమార్, భవానీ బాయి, ఆలయ అర్చకులు సురేష్ స్వామి పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో జనసేన జనబాట కార్యక్రమం

ఒంటిమిట్ట జూన్18 ప్రభాతవార్త:

ఒంటిమిట్టలో ఆదివారం జన సేన నాయకులు జనబాట కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరయణ ఆధ్వర్యంలో జనబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య ఆతిదిలుగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముఖరం చాంద్, రాష్ట్ర అధికార ప్రతినిది కీర్తన, రాజ ంపేట జనసేన నాయకులు ఆతికారి దినేష్, ఎంవిరావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి జనసేన నాయకులు పార్టీ సిద్ధాంతాలు పవన్ కల్యాణ్ చేస్తున్న సేవలను వివరించారు. రాబోయే రోజుల్లో పవన్‌కల్యాణ్‌కు అండగా వుండాలని కోరారు. ఆనంతరం స్థానిక హరితా హోటల్‌లో కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన పార్టీ క్రియా శీలక సభ్యులు రామ దాస్ బాలయానాది, పెద్దకోట్ల శాంతికు 50వేల చేప్పున చెక్కులను ఆంద జేశారు. ఈ సందర్బంగా ఆతికారి దినేష్ మాట్లాడుతూ మలిశెట్టి వెంకటరమణ ఆర్థిక సహకారంతో చేనేత విభాగం కార్యదర్శి రాటాల రామయ్య ఆద్వర్యంలో ఇద్దరు జనసేన కార్యకర్తలకు 50వేలు ఆర్థిక సహాయం చేసి వారికి ఆండగా నిలిచిందుకు చాలా సంతోషంగా వుందన్నారు. మండలంలో బాగా జనబాట కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు రాబోయే రోజుల్లో వారాహియాత్ర కూడా విజయవంతం ఆవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత ఆద్యక్షులు పండ్రారంజిత్ కుమార్, వీరమహిళ రెడ్డి రాణి,వెంకటయ్య, నాగరాజు, పోలిశెట్టి శ్రీనివాసులు, గుగ్గిళ్ళ నారార్జున, ఒబులేసు, రవి, వీరయ్య, ఆచారి, శ్రీరామ శ్రీనివాసులు, ప్రశాంత్ హేమంత్, బాలునాయక్, సుదీర్‌నాయక్, నరసింహా పాల్గొన్నారు.

## దళితయువతిని మోసం చేసిన యువకుడు అరెస్టు

మదనపల్లెక్రైం, జూన్ 18 ప్రభాతవార్త :

పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో నివాసం ఉన్న ఓ దళిత యువతిని ప్రేమపేరుతో వంచన చేసి కులవివక్షతో పెళ్ళికి నిరాకరించిన యువకున్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో నివాసం ఉన్న దళిత యువతిని అగ్రవర్ణ కులానికి చెందిన యువకుడు ప్రేమించి వంచన చేసి ఆమెపై అత్యాచారం చేసి కులవివక్ష పేరుతో యువతిని పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని యువతి రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ పిర్యాదు మేరకు పోలీసులు యువకునిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు పెట్టి విచారిస్తుండగా స్థానిక టిటిడి కళ్యాణ మండపం వద్ద యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిగా మెజిస్ట్రేట్ ముద్దాయికి 15 రోజులు రిమాండ్ విధించారు.

# ప్రధాన సరిహద్దు రేఖలు

**1.డ్యురాండ్ రేఖ:** ఇది భారత్, అఫ్ఘనిస్తాన్‌ల మధ్య సరిహద్దు రేఖ. 1893లో సర్ మోర్టిమర్ డ్యురాండ్ ఏర్పాటు చేశారు. ఈరేఖను భారత్ గుర్తించినప్పటికీ అఫ్ఘనిస్తాన్ గుర్తించలేదు.

**2.హిండెన్‌బర్గ్ రేఖ (మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత):** ఇది జర్మనీ, పోలెండ్‌ల మధ్య సరిహద్దు రేఖ. 1917లో మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ సైన్యం ఈ రేఖ వరకు దూసుకువచ్చారు.

**3.ఓడర్–నిస్సీ రేఖ(రెండో ప్రపంచ యుద్ధం తర్వాత):** ఓడర్, నిస్సీ నదుల వెంబడి జర్మనీ, పోలెండ్ దేశాలను విడదీసే సరిహద్దు రేఖ. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 1945 ఆగస్టులో జరిగిన పోలెండ్ కాన్ఫరెన్స్‌లో ఈరేఖను నిర్ణయించారు.

**4.సీజ్‌ఫ్రైడ్ రేఖ:** ఫ్రాన్స్‌తో తన సరిహద్దులను సూచిస్తూ జర్మనీ నిర్మించిన రక్షణ నిర్మాణం. దీనిని పోర్టిఫైడ్ లైన్ అని కూడా అంటారు.

**5.మేగినాట్ రేఖ:** రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు జర్మనీ దాడుల నుంచి రక్షించుకోవడానికి ఫ్రాన్స్ తమదేశాల సరిహద్దుల వెంబడి నిర్మించుకున్న 320కిలోమీటర్ల పొడవైన సరిహద్దు రక్షణ నిర్మాణం.

**6.మెక్ మెహాన్ రేఖ:** భారత, చైనా సరిహద్దులను నిర్ణయిస్తూ సర్ హెన్రీ మెక్ మెహాన్ గీచిన సరిహద్దు రేఖ. ఈ రేఖను చైనా గుర్తించలేదు. 1962లో ఈరేఖను ఉల్లంఘించింది.





**7.రాడ్‌క్లిఫ్ రేఖ:** భారత్, పాకిస్తాన్‌ల సరిహద్దును నిర్ణయిస్తూ సర్ సిరిల్ రాడ్ క్లిప్ రూపొందించిన రేఖ.

**8.16వ పార్లల్ లైన్:** నమీబియా, అంగోలాల మధ్య సరిహద్దు రేఖ.

**9.17వ పార్లల్ లైన్:** ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాంల మధ్య సరిహద్దు రేఖ (ఈరెండు దేశాల ఐక్యతకు ముందు)

## పుష్పాచలేశ్వర ఆలయంలో లింగం, పాని పట్టం లభ్యం

ఖాజీపేట జూన్ 18, ప్రభాతవార్త



ఖాజీపేట మండలం పుష్పగిరి సమీపాన స్వయంభుగా ఉద్భవించిన శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దేవస్థానం గర్భగుడిలో శుభ్రపరిచే సందర్భంలో స్వయం ఉద్భవ శ్రీ పుష్పచలేశ్వర స్వామి లింగము, పానిపట్టా లభించడం ఎంతో ఆనంద దాయకం అని లభ్యమైన వెంటనే లింగాన్ని తలపై పెట్టుకుని మండపంలోకి తీసుకు వచ్చి పుష్పగిరి క్షేత్ర అర్చకులు శ్రీ చెంచు సుబ్బయ్య శర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అంబాబత్తుల అండకొండ రాముడు పూజలు అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. శ్రీపుష్పాచలేశ్వర స్వామి లింగము, పానిపట్ట లభించిన వెంటనే చుట్టు పక్కల గ్రామస్తులకు తెలపడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుడి నిర్మాణం స్వామి వారికి జలభిషేకం చేయడానికి అతి త్వరలో భూమి నుంచి 2000 అడుగుల ఎత్తులో ఉన్న దేవాలయం వరకు పైపులైన్ ద్వారా నీటి సదు పాయం కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు లింగం పానిపట్టతో సహా కొన్ని రాతి విగ్రహాలు కూడా లభించడం జరిగిందని వాటిని మండపం ఆవరణంలో ఉంచి పూజా కార్య క్రమం కూడా నిర్వహిస్తామని అండకొండ రాముడు అన్నారు కార్యక్రమంలో శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక సభ్యులు పీఎం అశ్విని, కిషోర్ యాదవ్, వెంకట సాయి, సోమశేఖర్, రాజశేఖర్, జింకా శశికాంత్, పుల్లారెడ్డి పాల్గొన్నారు

## నేటి నుండి డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో సెమిస్టర్‌పరీక్షలు

వైవీయు జూన్ 18, ప్రభాతవార్త

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం లో నేటి నుండి జులై 3వ తేదీ వరకు 4వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పరీక్ష నియంత్రిక అధికారి ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.సీ సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ లోని టౌన్ ప్లానింగ్,బిల్డింగ్ టెక్నాలజీస్, కన్స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్,ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫోటోగ్రఫీ,అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, స్కల్ప్చర్, ఆర్ట్ హిస్టరీ విభాగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో దివ్యబలిపూజా కార్యక్రమం

ముద్దనూరు జూన్ 18, ప్రభాతవార్త

ముద్దనూరు పట్టణంలోని ఆర్సీఎం చర్చిలో ఆదివారం భక్తిశ్రద్ధలతో దివ్యబలి పూజా కార్యక్రమం జరిగింది. ముద్దనూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ మర్రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆదివారం రోజు ఏసుప్రభువు తిరు హృదయ మహోత్సవ పండుగ కావడంతో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దేవుడు ప్రేమ స్వరూపుడని, నీ వలె నీ పొరుగు వారిని ప్రేమించాలన్న దైవవాక్కును పాటించాలని, ఇక్కడి విశ్వాసులకు తెలియపరిచారు. దేవుని వాక్యానుసారం జీవించా లన్నారు. ఇక్కడ జరిగిన దివ్య బలి పూజా కార్యక్రమంలో ఫాదర్ మర్రిడితోపాటు, ఫాదర్ ప్రవీణ్, ఫాదర్ ఆల్బర్ట్‌లు పాల్గొన్నారు. దివ్య బలి పూజా కార్యక్రమానికి ముందు దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన దివ్య బలి పూజా కార్యక్రమంలో ఇక్కడి ఆర్సీఎం చర్చి విశ్వాసులు దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ముద్దనూరు సిస్టర్లు, మంగపట్నం సిస్టర్లు, ఉపదేశి ప్రభాకర్, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ఆర్సీఎం చర్చి విశ్వాసులు పాల్గొన్నారు.

## జెఈఈలో అడ్వాన్స్‌లో ఆల్‌ఇండియా 18వ ర్యాంక్

రామాపురం జూన్ 18, ప్రభాతవార్త



మండలంలోని హసనాపురం పంచాయతీ వసంతవాండ్లపల్లికి చెందిన కొండా సురేంద్ర రెడ్డి, కవిత కుమారుడు కొండా పుష్పకుమార్ రెడ్డి ఇటీవల జరిగిన జెఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో 263 మార్కులు సాధించి అల్ ఇండియా కేటగిరిలో 18వ ర్యాంకు సాధించాడు. ఇతడు ఒక సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చి 18వ ర్యాం కు సాధించడం పట్ల మండలంలోని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామ విద్యార్థికి ఆల్ ఇండియా లో ర్యాంకు రావడం పట్ల అభినందనలు తెలుపుతున్నారు.

## బద్వేలులో కళాశాల వసతి గృహ నిర్మాణం కలేనా?



రామాపురం జూన్ 18, ప్రభాతవార్త

స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐ ఎస్ఎఫ్ బద్వేల్ ఏరియా ఉపాధక్షులు వర్ధన్ మాట్లాడుతూ...విశాలమైన ఈ బద్వేల్ ప్రాంతంలోకి మెరుగైన విద్య ను అభ్యసించడానికి సుదీర్ఘ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహం లేక, ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉండలేక ఉన్నత చదువులకు దూరం అవడం ఎంతో బాధాకరమన్నారు. బద్వేల్ భూకబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి పెత్తందారులు మరింత కుబేరులవుతుంటే భావితరాల భవిష్యత్తుకు బాటలు వేసే విద్యార్థులు మాత్రం కరువు అవుతున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేల్ నియోజకవర్గం ఎస్సీ కాన్సి ట్యూషన్ అయినప్పటికీ పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అందించా ల్సిన కనీస మౌలిక సదుపాయాల్లో భాగమైన వసతి గృహం లేకపోవడం పట్ల చూస్తే పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా తెలుస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులపై ఎందుకింత చిన్నచూపుని వారు ఘాటుగా ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల అమూల్య భవిష్యత్తు కుంటుపడుతుందన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా వ్యవహరిస్తున్నా రని వారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్ స్పం దించి విద్యార్థుల అమూల్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాల వసతి గృహానికి నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్‌గా డిమాండ్ చేశారు. కార్యక్రమానికి హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వేపరాల ఏటి దారిని మరమ్మతు చేయండి : సీపీఎం



జమ్మలమడుగు, జూన్ 18, ప్రభాతవార్త:

పట్టణంలో గత వర్షాలకు వరదల కారణంగా వేపరాలకు వెల్లే ఏటి దారి కొట్టుకుపోయిన పరిస్థితితుల్లో ఇప్పటికీ దారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రని అదికారులు దారికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు అయినా అధికారులు రోడ్డు మరమ్మతులు ఎందుకు చేయడం లేదని ప్రజలకు వేపరాల, మైలవరం గ్రామాలకు సులువుగా దారి ఉండేదని ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలు గుర్తించి ఏటి దారిని మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, నరేంద్ర, ప్రభాకర్, భీమా పాల్గొన్నారు.

## మృతుడి ఆచూకీ లభ్యం - కేసు నమోదు



కలికిరి, జూన్ 18, ప్రభాతవార్త:

కలికిరి-మదనపల్లె రోడ్డు మార్గంలో ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీని ఆదివారం ఎట్టకేలకు పోలీసులు చేదించారు. మృతుడు కలికిరికి చెందిన శ్రీనివాసమూర్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలు కలరు. మృతుడి సోదరుడు శివశంకర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కలికిరి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్న చేస్తున్న ఏఎస్సై మధుసూదనాచారి తెలిపారు.

## కోటవూరులో ముమ్మరంగా కుటుంబ ఆరోగ్య సర్వే



బి.కొత్తకోట, జూన్ 18, ప్రభాతవార్త:

బి.కొత్తకోట మండలం కోటవూరు గ్రామంలో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ముమ్మరంగా జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్ నేతృత్వంలో సిగ్మా రీసెర్చ్ కన్సర్స కన్సల్టెన్సీ ఏజెన్సీ సభ్యులచే ఇంటింటా సర్వే జరిగింది. ఈ సర్వేలో కుటుంబ నియంత్రణ, మాతా శిశు సంరక్షణ, పోషణ రహిత, వ్యాధి నిరోధక టీకాల వివరాలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 6వ విడత నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ సర్వే నివేదికలను ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థకు పంపుతామన్నారు. ఈ సర్వేలో కోఆర్డినేటర్ గోవిందయ్య, రాజ్ భరత్, ముసలరెడ్డి, సీతారామయ్య, సూపర్వైజర్ విజయ్‌కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ తబిత, ఏఎన్ఎంలు రేణుక, కృపావతి, ఆశా కార్యకర్తలు వాణి, త్రివేణి పాల్గొన్నారు.

## దిగుబడి ఎక్కువ - ధరలు తక్కువ

### ఆందోళనలో అల్లనేరేడు రైతులు

మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :



గతంలో ఎన్నడూ లేని విధంగా అల్లనేరేడు పంట దిగుబడి ఎక్కువ కావడం, బయట ప్రాంతాల్లో డిమాండ్ లేకపోవడం వల్ల ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అల్లనేరేడు రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ఏడాది పాటు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతులు దిక్కుతోచక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో అల్లనేరేడు సాగును రైతులు విస్తారంగా సాగు చేశారు. దిగుబడి ఊహించని విధంగా రావడంతో ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో ఆదివారం అల్లనేరేడు కిలో రూ.50నుంచి 60ల వరకు ధర పలికింది. సాధారణంగా మదనపల్లె నుంచి అల్లనేరేడును తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పలు పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఈ ఏడాది సీజన్ తొలినుంచి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇటు వ్యాపారస్తులు, అటు రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు అల్లనేరేడు మంచి ఔషదం అయినా ధరలు లేకపోవడంతో కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వమైన అల్లనేరేడు పంటకు గిట్టుబాలు ధర కల్పించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## భారత బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బతీసిన బిజెపి

### వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్

మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :



దేశంలోని బ్యాంకులన్నీ కలసి బిజెపి ప్రభుత్వం పాలనలో 2014నుంచి 2022 వరకు రూ.12లక్షల కోట్లు నష్టాలు చవిచూడడం అందోళనకర విషయమని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2016లో చిన్న నోట్లు రద్దు చేసి రూ.2వేల పెద్దనోట్లును ప్రవేశపెట్టిన నాడే ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగం కదేలు అయ్యాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థను నిర్మూలించి ప్రైవేటు కంపెనీల ఈ-వ్యాలెట్ డిజిటల్ బ్యాంకింగ్ పెంపొందించేదకు ఓ పథకం ప్రకారం కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన విజయమాల్య, నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ లాంటి బడా వ్యాపారస్తులలో అత్యధికులు గుజరాత్ వ్యాపరస్థులు కావడం గమనించదగ్గ విషయమన్నారు. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను దెబ్బకొట్టి ప్రైవేటు సంస్థల డిజిటల్ బ్యాంకింగ్ ఈ వ్యాలెట్ వ్యవస్థలను ప్రోత్సహిస్తున్న బిజెపిని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలన్నారు.

## సమస్యలపై పోలవరం పోరుకేక పోస్టర్ల విడుదల



మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :

పోలవరం ప్రాజెక్టులో ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావసం కల్పించాలని, పనులను తక్షణం పూర్తి చేయాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలపై ఆదివారం పోలవరం పోరుకేక సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం పనుల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరం పోరుకేక పేరుతో భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 20న బద్రాచలం దగ్గర ఉన్న ఏటుపాక నుంచి మొదలై 15రోజులు పాటు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పాదయాత్ర విజయవాంతానికి సహకరించాలని కోరారు. పోలవరం నిర్వాహితుల సమస్యను అజెండా చేసేందుకే ఈ పాదయాత్ర చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, సురేంద్ర, నాగరాజు, రామక్రిష్ణ, పవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్కూటర్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కేవి.పల్లె, జూన్ 18 ప్రభాతవార్తః

మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాసు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి గర్నిమిట్ట చింతమాకులపల్లెకు చెందిన పవన్ అనే వ్యక్తికి తీవ్రగాయాలైయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి 108 వామనంలో పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## విభాగ్ సమీక్షా యోజనా సమావేశం



మదనపల్లెక్రైం, జూన్ 18 ప్రభాతవార్త :

అన్నమయ్యజిల్లా ఏబివిపి కార్యాలయంలో జిల్లాల సమీక్ష యోజనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి సంభాగ్‌సంఘటన కార్యదర్శి చిన్నశ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి పరిషత్ రాబోయే ఏడాదిలో సంస్థాగతంగా ఏ విధంగా ముందుకు వెళ్ళాలో సమావేశంలో చర్చించడం జరిగింది. జీఓనెంబర్ 77ను ఈ ఏడాదిలో అయినా అమలు చేయాలన్నారు. నాడునేడులో అవినీతి అక్రమాలపై విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున, జిల్లా కన్వీనర్ జెపి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యసమితి సభ్యులు సాయిహితేష్, అభిలాష్, గౌతం, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పీలేరు, జూన్ 18ప్రభాతవార్తః

ప్రతి మూడవ ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తారు. ఈ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. ఎస్‌వి అరవింద్ వైద్య బందం వారిచే ప్రసాద్ ఆసుపత్రిలో 150మందికి స్క్రీనింగ్ టెస్టులు చేశారు. అందులో 35 మందిని ఆపరేషన్లుకు ఎంపికచేసినట్లు వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారికి సొంతఖర్చులతో భోజనవసతితోపాటు సదుపాయా లు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సదాశివరెడ్డి, మహేష్‌గుప్తా, సురేంద్రనాధ రెడ్డి, వెంకటేష్, చెంగయ్య, ఈశ్వరరెడ్డి, సుధీర్, సత ్యం,

## శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారికి శిషేష పూజలు



వాల్మీకిపురం, జూన్ 18 ప్రభాతవార్తః

పట్టణ శివారు ప్రాంతంలోని శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలో ఆదివారం స్థానిక సీఐ సురష్‌కుమార్ హాజరై విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, సీఐకి స్వామివారి వస్త్రాలతో పాటు ప్రసాదాలను అందించారు. ఈకార్య క్రమంలో ఆలయ అభివద్ది కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఏపీసెట్‌లో రాష్ట్రంలో 4వ ర్యాంకు సాధించిన బాబు సుజన్‌రెడ్డి



పీలేరు, జూన్ 18 ప్రభాతవార్తః

స్థానిక సదుం రోడ్డు మార్గంలో విశ్రాంత ఉపాధ్యాయులు నరసింహారెడ్డి మనువడు, యుగంధర్‌రెడ్డి, కవితరెడ్డి దంపతుల కుమారుడు బాబుసుజన్‌రెడ్డి ఈఏపీసెట్‌లో రాష్ట్రంలోనే 4వ ర్యాంకు సాధించారు. ఆలిండియా ఐటీలో 34 ర్యాంకు సాధించారు. స్వయాన రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ బాబు సుజనారెడ్డికి రాష్ట్రసాయిలో 4వ ర్యాంకును ప్రకటిస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. తిరుపతిలోని నారాయణ లో కోచింగ్ తీసుకుంటూ జేఈఈ అడ్వాన్సుడ్ 2023ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 34వ ర్యాంకు సాధించారు. ఈసందర్భంగా బాబుసుజన్‌రెడ్డి మాట్లాడుతూ ముంబైలో ఆల్ ఇండియా కంప్యూటర్ సైన్సు విభాగంలో చేరి తన ప్రతిభను చాటి రాష్ట్రాన్ని భారతదేశాన్ని తన కన్న తల్లిదండ్రులను, వారి తాత నరసింహారెడ్డిలకు గొప్ప ఖ్యాతిగా నిలబెట్టాలనదే తన అభిమతం అని పేర్కొన్నారు. తండ్రి తిరుపతిలోని సీఆర్‌సీ లో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈఏపీసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించిన సుజన్‌రెడ్డికి పీలేరులోని పలు విద్యావేత్తలు, పారి శ్రామిక వేత్తలు ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలియజేశారు.

## అట్టహాసంగా పప్పు వేమారెడ్డి కుటుంబ అపూర్వ కలయిక



బి.కొత్తకోట, జూన్ 18, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట రంగసముద్రం రోడ్డులో గల కొత్తపల్లికి చెందిన పప్పు వేమారెడ్డి ఫ్యామిలీ అపూర్వ కలయిక ఆదివారం మదనపల్లి వెన్నెల ఫంక్షన్ హాలులో అట్టహాసంగా జరిగింది. పప్పు వేమారెడ్డి కుటుంబం తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలలో పేరెన్నికగన్నది. గతంలో ఈ ఫ్యామిలీ వేమారెడ్డి ట్రావెల్స్ పేరుతో ప్రసిద్ధి చెంది నేడు నా కుటుంబ సభ్యులు దశ దిశలా వ్యాపించి ఆదివారం ఈ అపూర్వ కలయిక జీవితంలో మరుపురాని రోజుగా నిలిచిపోతుందని మధుభూషణ్‌రెడ్డి తెలిపారు. పప్పు ఫ్యామిలీకి చెందిన కుటుంబ సభ్యులు ఉన్నత స్థాయికి చేరి దేశ విదేశాల్లో ఉన్న వారు ఈ అపూర్వ కలయిక క్యాక్రమానికి హాజరవ్వడం విశేషం. ఈ సందర్భంగా పప్పు కుటుంబ సభ్యులు వెన్నెల ఫంక్షన్ హాలులో తమ జీవిత విశేషాలను ఒకరినొకరితో పంచుకొని తమ ఆప్యాయతను చాటుకున్నారు. పప్పు కుటుంబం నుంచి ఈ అపూర్వ కలయిక కార్యక్రమానికి సుమారు 250 మందికి పైగా హాజరవ్వడం మరో విశేషం. ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరిపి మొత్తం కుటుంబ సభ్యులను ముందుండి నడిపించిన మధుభూషణ్‌రెడ్డికి అందరూ కృతజ్ఞతలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో వేమారెడ్డి, సదాశివరెడ్డి, మల్లె కరుణాకర్‌రెడ్డి, గిరిజమ్మ, సురేష్‌రెడ్డి, లాయర్ చైతన్యకుమార్‌రెడ్డితో పాటు వందలాది మంది పప్పు కుటుంబ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సంబంధం లేని వారు ఇళ్లు నిర్మించడం చట్టరీత్యానేరం

### స్థాయిలేని వారు విమర్శలు చేస్తే ఊరుకునేదిలేదు

### భూకబ్జాలపై పోరాటం ఆగదు




పీలేరు, జూన్ 18 ప్రభాతవార్తః

శ్రీకష్ణదేవరాయులు నూనెవిత్తుల కర్మాగారంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సంబందంలేని వారు ఇళ్లు నిర్మించడం చట్టరీత్యానేరమని తెదేపా శ్రేణులు విమర్శించారు. ఆదివారం పట్టణ పరిసర ప్రాంతాల్లో విలువైన భూములు కబ్జాకు గురౌతున్నట్లు అనర్హులకు ఎంజాయ్‌మెంటు సర్టిఫికేట్లు, పట్టాలు ఇస్తున్నారని తెదేపా నాయకులు విమవర్శించారు. రెవెన్యూ శాఖ నిబంధనలు ఉల్లంఘించి అనర్హులు భూములు ఆక్రమించుకుని మా నాయకుడు తెదేపా జాతీయ నేత కిశోర్‌కుమార్‌రెడ్డి అక్రమాలను, భూకబ్జాలను నిలదీసి ఆరోపిస్తే ఆయన స్థాయి మరచి సంబంధం లేని వారంతా విమర్శిస్తే ఊరుకునేది లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నాగిరెడ్డి కాలనీలలో జరిగిన అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. మీరు సర్వేచేయించండి అందుకు మేము సిద్దమే అన్నారు. పట్టణ శివారు ప్రాంతంలో వైకాపా నాయకుల కబ్జాలకు పాల్పడిన మాట వాస్తవం మానాయకుడి మాటకు కట్టుబడివ ఉన్నాం ఏచర్చకైనా సిద్దమే అన్నారు. ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లెల రెడ్డిబాషా, మండల అద క్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, పురం రామమూర్తి, అమ రనాధరెడ్డి, శ్రీనాధరెడ్డి, లక్ష్మీప్రసాద్, వసంతలరాజా, రెడ్డెప్పరెడ్డి, విజయ్ కుమార్, జాఫర్, షౌకత్, బుజ్జు, సుబాష్, మస్తాన్, ఖాదర్, అమరనాధరెడ్డి, శేఖర్, గోవర్ధన్‌రెడ్డి, మునేంద్ర, రవీంద్రనాయక్, రహంతుల్లా, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రజలకు అవగాహన



తంబళ్లపల్లె, జూన్ 18, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని మారుమూల గ్రామాల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై ఎంపీహెచ్‌వో వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండలంలోని వేణుమాకులపల్లి పంచాయతీ చెరువు కిందపల్లెలో సీజనల్ వ్యాధులు మలేరియా, డయేరియా, డెంగీ, సన్ స్ట్రోక్, టైఫాయిడ్, అనీమియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య సిబ్బందిచే ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో పలు వ్యాధులకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్‌వో మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో సకాలంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు ఓఆర్ఎస్ ద్రావణాన్ని సేవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, ఆశా కార్యకర్తలు నిర్మల, చంద్రకళ, భూదేవి, గ్రామీణ ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రిని సన్మానించిన రాష్ట్ర అధ్యక్షులు



మదనపల్లె, జూన్ 18 ప్రభాతవార్త :

రాష్ట్ర శిశుసంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్‌ను ఆదివారం కళ్యాణదుర్గంలో రాష్ట్ర కురబసంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన కురబల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. కురబ కార్పొరేషన్ ఛైర్మెన్ దృష్టికి కూడా సమస్యలు విన్నవించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కురబలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. వచ్చే 2024ఎన్నికల్లో కురబలకు అత్యధికంగా అసెంబ్లీ స్తానాలు కేటాయించాలని తెలిపారు.

## ఏఐసిటిఈ ఛైర్మెన్‌ను సన్మానించిన మిట్స్ కరస్పాండెంట్

కురబలకోట, జూన్ 18 ప్రభాతవార్త :



ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ (న్యూఢిల్లీ) ప్రొఫెసర్ టిజి.సీతారమ్‌ను మిట్స్ కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి బెంగుళూరులో సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ప్రెసిడెంట్ సొప్ప గంగిరెడ్డి, జనరల్ సెక్రటరి ఎం.శ్రీధర్, మిట్స్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌చౌదరిలు సన్మానించడం జరిగింది. ఈనెల 30న విజయవాడలో జరిగే అప్పెక్మ జనరల్ బాడీ సమావేశానికి ఆయనను ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆహ్వానించడం జరిగింది. వీరి ఆహ్వానాన్ని ఆయన స్వీకరించడం జరిగిందని మిట్స్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.

## ద్వజారోహణతో మహాభారత యజ్ఞం ప్రారంభం



కేవి.పల్లె, జూన్ 18 ప్రభాతవార్తః

మండలంలోని గర్నిమిట్టలో ఆదివారం ద్వజారోహణంతో మహాభారత యజ్ఞం ప్రారంభించారు. ఈసందర్భంగా గర్నిమిట్ట సురేష్‌శర్మ, పాండవుల ఆలయంలో శ్రీకష్ణ పరమాత్మ ద్రౌపతి సమేత పంచపాండవులు, పోతుంలరాజు విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. హోమం నిర్వహించి అనంతరం భారతయజ్ఞ నిర్వాహకులు జడ్పీటీసీ గజ్జల శ్రుతిశీనురెడ్డిలు పూజలు చేశారు. మధ్యాహ్నం తిరుపతి వాస్తవ్యులు గీతా భాగవతారిణి వ్యాసజననం హరికథాగానం చేశారు. ఈకథకు రవికుమార్, ప్రభాకర్ సహకారం అందించారు. రాత్రి శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి వారు నాటక ప్రదర్శన గావించారు.



## ఆనంద శిఖరాలు



భూటాన్ కొండల్లో నెలకొన్న చిన్న దేశం. జనాభా ఎనిమిది లక్షలు. ఇక్కడ ఊరూరా బుద్దిజం ఆనవాళ్లే! నదీతీరంలో, కొండ వాలులో.. ఎక్కడ చూసినా బౌద్ధ మఠాలే కనిపిస్తాయి. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో భూటానీయులు చాలా వెనుకబడి ఉన్నారు. ఆ దేశంలో టివి 1999లో మొదలయ్యింది. కానీ పర్యావరణాన్ని పరిరక్షించడంలో వాళ్లు అందరికన్నా ముందున్నారు. బౌద్ధపదంలో నడిచే భూటాన్‌లో గాలి స్వచ్ఛం, నీరు స్వచ్ఛం, భూమి స్వచ్ఛం. ఆ భూమిలో పండే ఆహార ధాన్యాలు కూడా స్వచ్ఛం.


ఆ దేశంలో సాగుబడి నూటికి నూరు శాతం సే ంద్రియ బాటలో సాగుతోంది. భూమి, నీరు కలుషితం కానంత వరకు ఏ దేశవాసులైనా హ్యాపీగా ఉండవచ్చునని అంటారు భూటానీయులు. ప్రపంచంలో సంతోష కరమైన దేశాల్లో ఒకటిగా భూటాన్ గుర్తి ంపు పొందింది. సముద్ర మట్టానికి 7,500 అడుగుల ఎత్తులో ఉండే భూటాన్‌లో హిమాలయాల సోయగాలు, కొండలు, కోనలు చెప్పుకుంటూ పోతే.. ఎన్నో అకర్షణలు. భూటాన్ రాజధాని థింపూ. ఈ దేశంలో ఉన్న ఏకైక అంతర్జా తీయ విమానాశ్రయం పారో నగరంలో ఉంటుంది. చుట్టూ కొండలు, గుట్టలతో ఉండే పారో విమానాశ్రయంలో దిగగానే మంచుతెరలు స్వాగతం పలుకుతాయి. ఆ తెరల చాటు నుంచి ఆకాశాన్నంటే పర్వతాలు కనిపిస్తాయి. కొండల నడుమ ఉన్న లోయలో పారే పారో నది, తీరం వెంట విస్తరించిన జనావాసాలు, బౌద్ధారామాలు, చూడటానికి రెండు కళ్లూ చాలవ్వు. పారోలో నేషనల్ మ్యూజియం, పురాతన కట్ట డాలు ఉన్నాయి. థింపూలో భారతీయ వంటకాలు దొరుకుతాయి. ఇక్కడి ఆర్గానిక్ ఫుడ్ అందుబాటు ధరల్లోనే లభిస్తుంది.

51.5 మీటర్ల బుద్ధుడి కాంస్య విగ్రహం థింపూలో ప్రధాన ఆకర్షణ. టాంగో, చెరి మఠాలు, డోకులా పాస్, పునాఖా ఇవన్నీ థింపూ నుంచి 50 - 80 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. పునాఖాలో బూటాన్ జానపద వైభవం కనిపిస్తుంది. ఇది ఒకప్పుడు భూటాన్ రాజధాని. ఇక్కడికి వచ్చే చాలా మంది తిరుగు ప్రయాణంలో టైగర్ నెస్ట్ సందర్శిస్తారు. థింపూ నుంచి దాదాపు 23 కిలోమీటర్ల దూరంలో ఉండే డోకులా పాస్.. సముద్రమట్టానికి 10,300 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ ప్రధాన ఆకర్షణ ఒకే చోట నిర్మించిన 108 స్మారక స్థూపాలు. 2003లో తిరుగుబాటు దారుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగానికి గుర్తుగా వీటిని నిర్మించారు. ఇక్కడి రాయల్ బొటానికల్ గార్డెన్‌లో అరుదైన పుష్పాలు, ఫలాలు చూడవచ్చు.

కోల్‌కతా, ఢిల్లీ నుంచి పారోకు విమాన సర్వీసులు ఉన్నాయి.

భూటాన్‌కు రోడ్డు మార్గంలో కోల్‌కతా చేరుకుని, నగరం లోని సిల్ధా రైల్వే స్టేషన్‌లో కాంచన్‌కన్యా ఎక్ స్ప్రెస్ లో హాసి మారా చేరుకోవాలి. హాసిమారా నుంచి 13 కిలోమీటర్ల దూరంలో ఇం డో - భూటాన్ సరిహద్దు ఉం టుంది. అక్కడి నుండి ట్యాక్సీలో నార్గేలామ్ గ్రామం చేరుకోవచ్చు. అక్కడి నుంచి పారో, థింపూ నగరాలకు బస్సులు అందుబాటులో ఉంటాయి.

భూటాన్ సందర్శనకు ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు మూడు రోజుల నుంచి వారం రోజుల నిడివి ఉన్న ప్యాకేజీలు (ఒక్కొక్కరికి)రూ.17,000 నుండి రూ.75,000 వరకు ఉంటాయి. వేసవి సీజన్‌లో భారతీయ రైల్వే ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తుంది.



# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాలు అమలు

**– 20 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక**

**– కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి**



**లక్కిరెడ్డిపల్లె, జూన్ 18, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు సూత్రాలు అమలు చేసి అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ప్రజలకు జనరంక పాలన అందిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో 20 కుటుంబాలు రాయచోటి ఇన్‌ఛార్జి అల్లాబకాష్ ఆద్వర్యంలో పార్టీ కండువా కప్పి పార్టీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తే ఆరు సూత్రాలు అమలు కార్యక్రమాన్ని ప్రవేశపెడతామని, రాష్ట్రానికి సంజీవిని వంటి ప్రత్యేక హోదా, రాయలీమకు ఉత్తరాంధ్ర జిల్లాలకు, బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్లు, దుగరాజపట్నంలో ఓడరేవును, విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ మెట్రో రైలు, విజయవాడ మెట్రో రైలును ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. వీటితో పాటు విశాఖ రైల్వేజోను మంజూరు చేస్తుందన్నారు. రైతులు వ్యవసాయ రుణాలను ఒకే సారి రూ.6లక్షల వరకు మాఫీ, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, సమాజంలో 25 శాతం నిరుపేద కుటుంబాలకు నెలకు నెలకు రూ.6వేలు ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ఏనాడు తప్పలేదన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే కాంగ్రెస్ ప్రజలను కాపాడుతుందన్నారు. ఆ దిశగా అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం 20 కుటుంబాల వారిని వెంకటేశ్వర్లు, ఓబులేసు, గంగాధర్, రమణ, రసయ్య, ఆంజనేయులు, వెంకటరమణ, గంగయ్య, చిన్న రెడ్డయ్య, పెంచలమ్మలకు కండువాలు కప్పిఎపార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలికేట్ ఎస్ఎండీ గౌస్, గోల్డ్ అల్లాబకాస్, మన్సూర్ అలీఖాన్, ఖదీర్, రసింహారెడ్డి, రఫీ, వేంపల్లె అమర్, వినయ్, శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాంసం దుకాణాలు తనిఖీ



**పులివెందుల రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :**

పులివెందులలోని పలు మాంసం దుకాణాలను మున్సిపల్ కమీషనరు నరసింహారెడ్డి ఆదివారం పరిశీలించారు. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన మాంసం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా ధరలను తెలుపుతూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# గాలి, వానతో అరటి పంటకు నష్టం



**దువ్వూరు, జూన్ 18, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో శనివారం రాత్రి వచ్చిన గాలి, వానతో సుమారు 12 ఎకరాల్లో అరటి పంట నేల వాలినట్లు బాధిత రైతులు తెలిపారు. రాత్రి వచ్చిన గాలీ వానతో గ్రామానికి చెందిన చిన్న లక్ష్మి, రాజశేఖర్‌రెడ్డి, శివారెడ్డిలకు చెందిన సుమారు 12 ఎకరాల్లో అరటి పంట పూర్తిగా దెబ్బతిందని గాలితో నేలకు వాలిందని ఎకరాకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టినా గాలివానతో దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**నందలూరు, జూన్ 18 ప్రభాతవార్త**

నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల గురువుల సమ్మేళనం పూర్వ విద్యార్థులైన అల్లం అశోక్‌కుమార్, బద్వేల్ మస్తాన్‌బాషా, పల్లె మాధవిల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ గురువులైన కుళాయిరెడ్డి, కృష్ణయ్య, పుల్లారెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, జయరామరాజు, సాంబయ్య, రామసుబ్బన్నలకు పాదపూజ చేసి పట్టుశాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను బహుకరించారు. పూర్వ విద్యార్థుల సౌజన్యంతో 2.20 లక్షల రూపాయలు విలువ గల 73 డెస్కులను నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వితరణగా అందజేశారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పూర్వ ప్రధానోపాధ్యాయులైన శంకర్‌రెడ్డిలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అరిగె హరిబాబు, భీమా, శ్రీధర్, బోనాసి నరసింహులు, కత్తి చలపతిరావు, పిఎల్ నారాయణ, మహమూద్, రఘుప్రసాద్, గంటా అరుణ, తోట విజయలక్ష్మీ, మాలతి, శైలజా, వరలక్ష్మీ తదితర పూర్వవిద్యార్థులందరూ భారీగా హాజరై గడిచిన సంగతులన్నింటిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమం పూర్తిగా ఒక పండుగలాగ జరుపుకుని పరమపదించిన గురువులను, స్నేహితులను గుర్తు చేసుకుని శ్రద్ధాంజలిని ఘటించారు.

# గవర్నమెంట్ ఇంటర్, డిగ్రీ కళాశాలలు బద్వేల్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలి



**బద్వేల్ అర్బన్, జూన్ 18, ప్రభాతవార్త:**

బద్వేల్ నియోజకవర్గం లోని బద్వేలు అట్లూరు గోపవరం మండలం కలిపి ఇంటర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని విలేకరుల సమావేశంలో ఎన్ ఎస్ యు ఐ బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు జీవన్ కుమార్ తెలిపారు. బద్వేల్ నియోజకవర్గం లో ఎన్ని సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యార్థులను పట్టించుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం ఎందుకంటే ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఫీజులు ఎక్కువ ఉండటం వల్ల పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చదవలేరు కావున గవర్నమెంట్ డిగ్రీ ఇంటర్ కళాశాలలో కట్టితే పేద విద్యార్థులు డిగ్రీ ఇంటర్ కళాశాలలో చేరి వారి సంపూర్ణ భవిష్యత్తు కోసం కష్టపడిచదువుకుంటారు.ఇంతవరకు బద్వేల్ మున్సిపాలిటీలో గవర్నమెంట్ కాలేజీ లో లేకపోవడం బద్వేల్కే అవమానం ఎందుకంటే బద్వేల్ నియోజకవర్గంలో చాలా మంది పేద విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు వారిలో ఆర్థిక పరిస్థితి బాగాలేక సగం మందిపైగా చదువుకోలేకపోతున్నారు కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి బద్వేల్ నియోజకవర్గం లోని మూడు మండలాలు కలిపి ఒక గవర్నమెంట్ ఇంటర్ డిగ్రీ కళాశాలలో కట్టిస్తారని ఆశిస్తున్నాను విద్యాశాఖ అధికారులు స్పందించక పోయిన యెడల అన్ని విద్యార్థి సంఘాలతో విద్యార్థులతో భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని విద్యాశాఖ అధికారులకు మనవి చేసుకుంటున్నారు ఈ కార్యక్రమానికి ఎన్ ఎస్ యు ఐ నాయకులు వెంకటేష్ కాజవల్లి పాల్గొన్నారు.

# అనంతపురం గంగమ్మకు ఘనంగా పూజలు

**లక్కిరెడ్డిపల్లె, జూన్ 18, ప్రభాతవార్త:**



మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఏప్రిల్ మాసంలో ప్రతి ఆదివారం భక్తులు గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. ఎండలు మండుతున్నా ప్రాంగణం చుట్టూ ఉన్న చెట్ల నీడలో భక్తులు సేద తీరారు. శుద్ధి చేసిన నీటిని భక్తులు ఉపయోగిస్తున్నారు. రవీంద్రరాజు, ఛైర్మన్ సామల నరసింహారెడ్డిలు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేశారు.

# పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



**పులివెందుల, జూన్ 18, ప్రభాతవార్త :**

పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలు అని, అటువంటి పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పులివెందుల అర్బన్ సీఐ రాజు పేర్కొన్నారు. పులివెందులలో ఆదివారం శాంతి కమిటి సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత విభేధాలకు తావివ్వకుండా అందరు సమిష్టి కృషితో కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. పట్టణంలో హిందూ, ముస్లింల బంధం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఎలాంటి చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కారమార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్సై సత్యనారాయణ, ఏఎస్ఐ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**పులివెందుల రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :**

పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సమ్మర్‌క్యాంప్ ముగింపు వేడుక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాస్టర్ శబరీష్, ఎస్ఆర్ డ్యాన్స్ స్కూల్ శిష్య బృందంచే క్లాసికల్, జానపద, వెస్ట్రన్ నృత్యాలు చేసి అలరించారు. ఏకదంతాయ వక్రతుండాయ, ఒరి మగడా, వయ్యారి మగడా, భరత వేదముగ నిరత నాట్యముగ, ఆహ అల్లరి అల్లరి చూపులతో, తదితర పాటలకు పిల్లలు నృత్యాలు చేశారు. అలాగే ఎస్‌కె ఫిల్మ్, డ్యాన్స్ స్టూడియో యూట్యూబ్ ఛానల్‌లో ఖుషి మూవీ నుండి నా రోజా నువ్వే కవర్ సాంగ్‌ను పులివెందుల మహేష్, హరి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల ప్రజలు మ్మల్ని ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మూవీ కొరియోగ్రాఫర్ శర్వన్, పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలి

**– వైఎస్సార్ సిపి జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీ నారాయణరెడ్డి**

**పోరుమామిళ్ళ రూరల్, జూన్ 18ప్రభాతవార్త:**



పేదల భూములు వేరొకరి పేర్ల మీద ఉందని చెప్ప డం లోకేష్‌కు తగునా అని వైఎస్సార్‌సిపి జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మీ నారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. జూన్ 12 బద్వేల్‌లో యువగళం కార్యక్ర మంలో పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీలో సర్వేనెంబర్ 916లో 24 ఎకరాలలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ చిత్తా విజయప్ర తాప్‌రెడ్డి ఆక్రమణ ఉందని చెప్పడం నారా లోకేష్ అవివేకానికి నిదర్శనమన్నారు. నిజనిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని వారు పేర్కొన్నారు.

# మంచి సందేశాత్మక వెబ్ సిరీస్ విజయవంతం సాధించాలి

**– ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**



**రాయచోటి, జూన్ 18ప్రభాతవార్త:**

రాయచోటి ప్రాంత యువకులచే అద్భుతంగా చిత్రీకరించిన భగట్ వెబ్ సిరీస్ అద్భుత విజయం సాధించాలని వైఎస్సార్‌సిపి రాయచోటి వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్ సిపి కార్యక్రమంలో రాయచోటి ప్రాంత యువకులచే ప్రధాన తారాగణంగా చిత్రీకరించిన భగత్ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుల మీదుగా విడుదల చేశారు. ఈ వెబ్ సిరీస్‌ను రాయచోటి ప్రాంత యువకులు అగస్తీశ్వర ప్రొడక్షన్‌లో రాజకీయ ప్రతీకార డ్రామా ముఖ్య తారాగణంగా లిఖిత్, ఇతీశ్వర్, రాజేష్, మణికాంత్, మధు, హేమాద్రి, అల్లా బక్ష్, ఉదయకుమార్, దీపక్ తదితరులు నటించగా డైరెక్టర్ ఇనుకుంటి మల్లికార్జున, సంగీతం సారధి ఆర్‌జిలు సారధ్యం వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మంచి సందేహంతో భగత్ వెబ్ సిరీష్ చిత్రీకరించిబడిందన్నారు. రాయచోటి ప్రాంత యువకులు సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా రాయచోటి పరిసర ప్రాంతాల్లోనే అద్భుతమైన ఫోటోగ్రఫీతో వెబ్ సిరీస్‌ను చిత్రీకరించారన్నారు. ఇతర దేశాలతో పాటు మనదేశంలోని యువత పలు యాప్‌లును కనిపెడుతూ ఉన్నతస్థాయికి ఎదుగుతున్నారన్నారు. సమాజానికి మంచి సందేశాత్మక వెబ్ సిరీస్‌ను అందించాలని ప్రయత్నిస్తున్న ఇటువంటి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా భగత్‌వెబ్ సిరీస్ బృంధానికి బెస్ట్ విషెస్‌ను శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మెన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, రామాపురం జడ్పీటిసి మాసన సుదర్శన్‌రెడ్డి, రామాపురం జడ్పీటిసి మాసన వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకట సుబ్బయ్య నాయుడు, శివ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎత్తిరాజుపల్లె విద్యార్థి ప్రతిభ



జాతీయస్థాయిలో వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో బద్వేల్ మండలం ఎత్తిరాజుపల్లె గ్రామానికి చెందిన సిటీ మాన్ టైలర్ దుంపల శ్రీనివాసులు రెడ్డి కుమార్తె దుంపల మహిత అనే విద్యార్థిని జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో జాతీయస్థాయిలో 4936 రాంక్స్ సాధించింది. విద్యార్థి మహితను వైసిపి సీనియర్ నాయకులు వంకెల పోలిరెడ్డి బిజి వేముల రామసుబ్బారెడ్డి అంబవరం వెంకటేశ్వర రెడ్డి, దుంపల కృష్ణారెడ్డి బిజెపి సీనియర్ నాయకులు బొమ్మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మన సుబ్బరాయుడు,విజయ్, గాజుల నరసింహులు (బాబు) ఆవులెట్ శేఖర్ రాయల్, గాజుల కుమార్, బి వెంకటేష్, తోపాటు పలువురు నాయకులు బంధుమిత్రులు అభినందించి భవిష్యత్తులో ఇటువంటి ఉత్తమ ఫలితాలు మరెన్నో సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థిని అభినందించారు.

# ఆరుగురు ఎర్రచందనం నిందితులు అరెస్టు



**వాల్మీకిపురం, జూన్ 18ప్రభాతవార్తః**

శేషాచలం అడవుల నుంచి కర్ణాటక రాష్ట్రం కటికన హళ్లికి ఎర్రచందనం దుంగలను అక్రమంగా వాహనంలో తరలిస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన వాల్మీకిపురం మండలంలోని విఠలం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు తమిళనాడు రాష్ట్రానికి చెందిన విమల్‌రాజు(28), కేశవన్(30), రాజేంద్రన్(31), రజిత్‌కుమార్, రాజశేఖర్(24), తిరుపతి(41), గోవిందరాజ్(29)లు కలిసి శేషాచలం అడవులు కారులో ఎర్రచందనం దుంగలు తీసుకుని ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి వాల్మీకిపురం మండలం విఠలం వద్ద వీరి కారు అతివేగంగా వెలుతుంది,. సమాచారం మేరకు అక్కడే కాపుకాసిన స్థానిక ఎస్సై నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందం కారును అడ్డగించడంతో కారున ఆపి డ్రైవరు రాము పరారైయ్యాడు. కారును పోలీసులు చుట్టుముట్టడంతో అందులో ఉన్న ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులో రూ.1.5లక్షల విలువగల ఎర్రచందనం దుంగలును స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి డీఎస్పీ మహబూ బ్‌బాషా ఆద్వర్యంలో నిందితులను అరెస్టుచూపి రిమాండుకు తరలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఈకేసులో దుంగలు, వాహనంతో సహా రూ.4 లక్షలు విలువ ఉంటుందని తెలిపారు. అనంతరం ఎస్సై పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈకార్యక్రమంలో సీఐ సురేష్‌కుమార్, ఎస్సై నాగేశ్వర రావు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యూనివర్శిటిలో డిగ్రీకి అడ్మిషన్లు

**మదనపల్లెక్రైం, జూన్ 18 ప్రభాతవార్త :**

మదనపల్లె బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటి 2022-23 ఏడాదికి గానూ బిఏ. బికాం, బిఎస్‌సి కోర్సుల్లో చేరేందుకు అడ్మిష న్లు కోరుతున్నారు. ఈ డిగ్రీ కోర్సుల్లో చేరదలచిన వారు ఇంటర్, ఐటిఐ, పాలిట క్నికల్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువు ఉన్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటశివారెడ్డి తెలిపారు. అడ్మి షన్ల కోసం 8317653896, 7382929684నెంబర్లను సంప్రదించాలన్నారు.

# జెఈఈ అడ్వాన్స్‌లో మెరిసిన గాలివీడు విద్యార్థి

**గాలివీడు, జూన్ 18ప్రభాతవార్త:**



జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గాలివీడు విద్యార్థి వెలిగింటి అజయ్ కుమార్‌రెడ్డి అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. స్థానిక అరవీటివాండ్లపల్లికి చెందిన క్రిష్ణకిషోర్‌రెడ్డి, కామాక్షి దంపతులు కుమారుడైన అజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం విడుదలైన జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 297 ర్యాంక్ సాధించాడు. 360మార్కులకు గాను 257 మార్కులు సాధించి సత్తా చాటారు. మంచి ర్యాంక్ సాధించిన అజయ్ కుమార్‌రెడ్డిని బంధుమిత్రులు, గ్రామస్తులు పలువురు ప్రశంసించారు.

# కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**గాలివీడు, జూన్ 18ప్రభాతవార్త:**

గాలిఈడు గ్రామ పంచాయతీ శ్రీ వెంకటేశ్వర అరవింద్ (మధురై) కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల వ్యాప్తంగా వృద్ధులు అధిక సంఖ్యలో వైద్య శిబిరానికి హాజరయ్యారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు భోజన వసతి, ఆపరేషన్ అవసరమైన వారికి బస్ సౌకర్యం వైస్ ఎంపిపి యదుభూషణ్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు పూర్తయిన అనంతరం ఆపరేషన్ అవసరమైన 50 మందిని వైస్‌ఎంపిపి తన సొంత నిధులు వెచ్చించి ప్రత్యేక బస్‌లో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం కావడంతో కృషి చేసిన శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు, స్థానిక నాయకులుకు, యదుభూషణ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిట్టపల్లి మధుసూదన్‌రెడ్డి, తిరుపతి నగరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బి.వి.ఎస్. క్రిష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్ నాయుడు, గ్రామ వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

**– వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి**



**గాలివీడు, జూన్ 18ప్రభాతవార్త:**

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గాలివీడు వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గల మైదానంలో గత నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వెలిగళ్ళు ఎంవిఆర్ జట్టుకు రూ.36,000, రన్నర్స్‌గా నిలిచిన నులివీడు హర్ష జట్టుకు రూ.30,000 నగదు బహుమతులతో పాటు మెమోంటోను అందజేశారు. క్రీడీకారులకు భోజన సదుపాయాన్ని మండల యూత్ లీడర్ వెంకటరమణారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తంగాల వేణుగోపాల్, యువజన నాయకులు వెంకట రమణారెడ్డి, రామాంజులురెడ్డి, గంగాధర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జేఎన్‌టియు వీసి రాక


**కురబలకోట, జూన్ 18 ప్రభాతవార్త :**



జేఎన్‌టియు అనంతపురం యూనివర్శిటి వీసి ప్రొపెసర్ జి.రంగజనార్ధన్ సోమవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు రానున్నారు. ఈ నెల 19నుంచి 23వరకు జరిగే ప్యాకల్టి డెవలప్‌మెంటు ప్రొగ్రామ్‌ను ఆయన పాల్గొననున్నారని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఐదురోజులు పాటు కాంటెన్‌పదవి ప్రోగస్, చాలెంజస్, అండ్ ఇస్యూ మెటల్‌త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై ఐదురోజులు పాటు ప్యాకల్టి ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# రూ.15 కోట్లు అప్పు చేసి ఓబులేసు అనే వ్యక్తి పరారు

**పోరుమామిళ్ళ రూరల్, జూన్ 18ప్రభాతవార్త:**



పోరుమామిళ్ళ పట్టణంలోని లక్ష్మిశెట్టి ఓబేలేష్ అనే వ్యక్తి చిటీల వ్యాపారం చేస్తూ వ్యాపారస్తులని, మధ్య తరగతి ప్రజలని, ఉద్యోగస్తులని మాయ మాటలతో నమ్మించి వారి దగ్గర నుండి సుమారు రూ.15 కోట్లు అప్పు చేసి ఓబులేసు అనే వ్యక్తి పరారయ్యాడు. ఇతని దగ్గర మోసపోయిన వారు సుమారు 150 మంది బాధితులుగా తేలారు. వీరంతా పిల్లల చదువుల కోసమని, పెళ్లికి అని, చిటీలు కడుతుండేవారు. ఇతని గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

